నిమజ్జనాలకు రెడీ..

- గణపతి నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి
- రేపు 700 విగ్రహాలు వచ్చే అవకాశం
- నగరంలో పటిష్ట ఏర్పాట్లు
- పోలీసుల నిఘా

కంబాలచెరువు: వినాయక చవితి వచ్చిందంటే దాదాపు దేశమంతటా సందడి నెలకొంటుంది. వాడవాడలా బొజ్జ గణపయ్యను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. గణపతి నవరాత్రుల పేరుతో భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుతారు. ఇక మన గోదావరి జిల్లాల్లో నెలకొనే ఆధ్యాత్మిక సందడి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రస్తుతం వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ఆలయ కమిటీలు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు నగరంలోని విగ్రహాలను శనివారం రాజమహేంద్రవరంలోని గోదావరిలో నిమజ్జనం చేయడానికి తీసుకువస్తారు. దీనిలో భాగంగా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

అధికారుల అప్రమత్తం

జిల్లాతో పాటు రాజమహేంద్రవరంలోని వివిధ ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే కొందరు విగ్రహాల నిమజ్జనం జరిపారు. అయితే ఎక్కువ మంది శనివారం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తుకున్నారు. నగరంతో పాటు జిల్లాలోని వివిధ చోట్ల ఏర్పాటు చేసిన విగ్రహాలు ఆ రోజు రాజమహేంద్రవరం చేరుకుంటాయి. దీంతో అన్ని శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా ఈ ప్రక్రియలో పోలీసు శాఖ చాలా కీలకంగా ఉంటుంది. నిమజ్జనాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఇప్పటికే పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిమజ్జనానికి చూడడానికి వచ్చే వారికి కూడా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

ట్రాఫిక్ ఆంక్షలు

వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నగరంలో శనివారం ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీనికి సంబంధించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. రద్దీ నేపథ్యంలో ఎలాంటి ఘటనలూ జరగకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఘాట్ల వద్ద ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఘాట్ల వద్ద డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. నిమజ్జనాలు ప్రధానంగా జరిగే గోదావరి గట్టు ఇసుక రేవు వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. త్రీటౌన్, వన్ టౌన్, ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని రేవుల్లో నిమజ్జనాలకు అనుమతులు ఇచ్చారు.


గణపతి విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

కట్టుదిట్టమైన భద్రత



టూటౌన్ పరిధిలో సుమారు 50 గణేశ్ విగ్రహాలను శనివారం నిమజ్జనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో విగ్రహాల ఊరేగింపులు జరిగే ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశాం

. – శివ గణేష్, టూటౌన్ సీఐ, రాజమహేంద్రవరం

ప్రజలు సహకరించాలి



మా స్టేషన్ పరిధిలో వినాయక విగ్రహాలు అధికంగా ఉన్నాయి. సుమారు సుమారు 250 పైగా విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. దీంతో పలు రోడ్లు ఊరేగింపులు, భక్తులతో రద్దీగా మారతాయి. నగర ప్రజలు కూడా సహకరించి, ప్రశాంతంగా నిమజ్జనాలు జరిగేలా చూడాలి.

– వి.సూర్య అప్పారావు, త్రీటౌన్ సీఐ, రాజమహేంద్రవరం

సమాచారం ఇవ్వండి



వన్ టౌన్ పరిధిలో ఏర్పాటు చేసిన సుమారు 92 విగ్రహాలను శనివారం నిమజ్జనం చేయనున్నారు. దీనికి సంబంధించి ముందుగా చేపట్టాల్సిన చర్యలను పోలీసు సిబ్బందికి వివరించాం. స్టేషన్ పరిధిలోని మార్కండేయస్వామి టెంపుల్ సమీపంలోని ఇసుక రేవు వద్ద నిమజ్జనాలు జరగనున్నాయి. వేడుకల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వండి.

– మురళీకృష్ణ, వన్ టౌన్ సీఐ, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం


దుళ్లలో నిర్వహిస్తున్న గణపతి హోమం

కడియం: దుళ్ల శివాలయం వీధిలోని లక్ష్మీగణపతి స్వామివారి ఉత్సవ పందిరిలో గురువారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. బాదంపూడి సత్యనారాయణ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఆదర్శం


నరసింహ కిశోర్, ఎస్పీ

కంబాలచెరువు: ప్రేమ, సహనం, శాంతిని బోధించిన మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. ఆయన ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ పండగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల్లో సోదరభావం, సహనం, కరుణ, ఐక్యత మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

నిబద్ధతతో పనిచేసే వారికి గుర్తింపు


బొమ్ముల దత్తు, గోపీ శ్రీనివాస్‌లను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: నిబద్ధతతో పనిచేసే వారికి ఎల్లప్పుడూ పార్టీ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. నగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం ఓబీసీ మోర్చా నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన బొమ్ముల దత్తు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులైన రొంగల గోపీ శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు ఎన్ఆర్ఐఎఫ్ ర్యాంకు



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే

కంబాలచెరువు: భారత ప్రభుత్వ నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ఫ్రేమ్‌వర్క్ ర్యాంకింగ్స్‌లో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల 201 – 300 మధ్యలో స్థానం సంపాదించింది. ఆ వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే గురువారం తెలిపారు. విద్య, పరిశోధన రంగాలలో కళాశాల నిరంతర పురోగతికి, అభివృద్ధికి నిదర్శనమని ఆయన తెలిపారు. కళాశాల కో ఆర్డినేటర్ జి.చంద్రశేఖర్, వారి బృందం కృషి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సహాయ సహకారాలతో ఈ ఘనత సాధించామన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకొన్నారు.

సినిమాలు



శ్యామల:	ఘాటీ
సూర్యమినీ:	ది కంజ్యూరింగ్
సూర్యప్యాలెస్:	ఘాటీ
స్వామి:	కూలీ
అనుశ్రీ:	మదరాసి
శివజ్యోతి:	ది బెంగాల్ ఫైల్స్
రాజా:	మదరాసి
ఊర్వశి:	లిటిల్‌హార్ట్స్
మేనక:	ది కంజ్యూరింగ్
రంభ:	మహావతార్ నరసింహ
అప్సర:	కొత్తలోక
అశోక:	మదరాసి
నామవరం	
వీఎస్ మహల్	: ఘాటీ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ఘాటీ, మదరాసి
కడియం	
వెంకటసూర్య	: మదరాసి,ఘాటీ

అనుమతుల జారీలో జాప్యం తగదు

రాజమహేంద్రవరం సిటీ: భవన నిర్మాణాల అనుమతుల జారీలో జాప్యం ఉండరాదని టౌన్ ప్లానింగ్ అధికారులను కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆమె గురువారం ప్రకాశం నగర్, సోమాలమ్మ పుంత రోడ్డు, రెయిన్ బో హాస్పిటల్ రోడ్డులో పర్యటించి పలు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణాలకు అనుమతుల జారీని వేగవంతం చేయాలన్నారు. ఇచ్చిన ప్లాన్ ప్రకారమే భవనం నిర్మిస్తున్నారా, సమగ్ర వెరిఫికేషన్ విధానం అమలు చేయాలన్నారు. ప్లానింగ్‌లో ఏమైనా వ్యత్యాసాలు ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాలను అపార్ట్‌మెంట్ల లోపలే పార్కింగ్ చేసుకునేలా భవన యజమానులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు.


నగరంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి

కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఏసీపీలు శ్రీనివాస్, నాగవల్లి, ఇతర టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కారాలతో మరింత బాధ్యత

సీటీఆర్ఐ: పురస్కారాలు బాధ్యతను మరింత పెంచుతాయని మెజీషియన్ డాక్టర్ మనోహరరావు (స్టిక్ మనోహర్) అన్నారు. ఆయన గురువారం నగరంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని డాక్టర్ ఎన్టీఆర్ కళామందిరంలో బుధవారం రాత్రి కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీవీ పట్టాభిరామ్ స్మారక కీర్తి పురస్కారాన్ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా తనకు అందజేశారన్నారు. ఇంద్రజాల దిగ్గజం పట్టాభిరామ్ స్మారక కీర్తి పురస్కారం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ రంగానికి మరింత గుర్తింపు తీసుకు రావడానికి కృషి చేస్తానన్నారు.


పురస్కారం అందుకుంటున్న మనోహరరావు

ధర్మానిదే అంతిమ విజయం

సీటీఆర్ఐ: అధర్మ వర్తనుల పన్నాగాలు ఎన్నటికీ ఫలించవని, అంతిమ విజయం ధర్మానిదేనని శ్రీహరి శ్రీనివాస శాస్త్రి అన్నారు. గోదావరి గట్టున ఉన్న ఆంధ్ర యువతి సంస్కృత కళాశాలలో గత నెల 27న ప్రారంభమైన 54వ సరస్వతీ సపర్యా మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు కార్యక్రమంలో ఏలూరుకు చెందిన శ్రీహరి శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ రావణుని కోరికపై రామ లక్ష్మణులను కాళికాదేవికి బలి ఇవ్వాలనుకున్న మైరావణుని పన్నాగాన్ని హనుమంతుడు ఎలా భగ్నం చేశాడో వివరించారు. ఈ కథ అంతా ఒక్క రాత్రిలోనే జరిగిందని, ''హనుమత్ సంహిత'' గ్రంథంలో ఈ ఉదంతం కనిపిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.అన్నపూర్ణ మాట్లాడుతూ సరస్వతీ సపర్యా మహోత్సవాలు విజయవంతంగా ముగిశాయన్నారు. కార్యక్రమాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రధాన వక్తను నిర్వాహకులు సత్కరించారు. కోట్ల కనకేశ్వరరావు, అధ్యక్షుడు గాదె కిషోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న శ్రీహరి శ్రీనివాస శాస్త్రి

ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా రమణ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) కార్యదర్శి జీవీ రమణ ఆంధ్రప్రదేశ్ నాటక అకాడెమీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు 25 మందితో పాలక వర్గ జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా గోకవరం బస్టాండ్ సమీపంలోని బాలు స్మారక మందిరంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవీ రమణ మాట్లాడారు. ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తూ, రాజమహేంద్రవరంలో కూడా విధులు నిర్వర్తించి, ఇక్కడే స్థిరపడ్డానన్నారు. రాకా సంస్థ స్థాపనలో కీలక పాత్ర పోషించి కార్యదర్శిగా వ్యవహరిస్తూ, పలు సాంస్కృతిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నాటక అకాడమీ తరపున చేయాల్సిన కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేస్తానని తెలిపారు. కాగా.. రమణను రాకా సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, ఉపాధ్యక్షుడు తిరుమల కృష్ణమోహన్, కోశాధికారి సూరప రెడ్డి తాతారావు, సభ్యులు భమిడిపాటి రామకృష్ణమూర్తి తదితరులు అభినందించారు.


జీవీ రమణను సత్కరిస్తున్న రాకా సంస్థ సభ్యులు

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం


వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్న ఏఎస్పీ మురళీకృష్ణ, డీఎస్పీ విద్య తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: వినాయక నవరాత్ర మహోత్సవాలలో భాగంగా బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనం గురువారం ఘనంగా జరిగింది. జిల్లా ఏఎస్పీ (అడ్మిన్), ఎన్‌బీఎం మురళీకృష్ణ, తూర్పుజోన్ డీఎస్పీ బి.విద్య, ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథం ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. డప్పు వాయిద్యాలతో, ఊరేగింపుగా గోదావరిలో వినాయకుడిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ గతిని మార్చేది గురువులే

- స్మరించుకున్న వక్తలు
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కంబాలచెరువు: సమాజ గతిని మార్చేది గురువులేనని వక్తలు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందస్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి డి.విజయశ్రీ హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్, ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఎస్ఎస్‌వీఎల్ నరసింహం చేతుల మీదుగా అధ్యాపక బృందానికి మెమెంటోలు బహూకరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.త్రినాథరాజుకు రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్ అవార్డు వచ్చిన సందర్భంగా సత్కరించారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషి

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎప్పుడూ ఉంటుందని డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు బొప్పన అప్పారావు అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాన్ని గ్రామస్తులు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బొప్పన అప్పారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కురుమళ్ల ఆంజనేయులు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కరుటూరి శ్రీనివాసరావు పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా బొప్పన అప్పారావు.. పాఠశాలకు రూ.8 వేలు విలువైన పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ (మైక్‌సెట్)ను బహూకరించారు. ప్రధానోపాధ్యాయిని టి.ఉషారాణి పాల్గొన్నారు.

- బొమ్మూరులోని జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ ఆధ్వర్యంలో సీనియర్ ఉపాధ్యాయిని పద్మశ్రీని సత్కరించారు. అనంతరం స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.

ఉపాధ్యాయులకు సత్కారం

కడియం: వెలుగుబంటి రామచంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కడియం మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న 9 మంది ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, ట్రస్ట్ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం(నాని), హైస్కూలు హెచ్ఎం టి.సత్యనారాయణ, మండల విద్యాధికారులు మణికుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గురువులకు మహోన్నత స్థానం

సీటీఆర్ఐ: సమాజంలో గురువులకు మహోన్నత స్థానం ఉందని విశ్రాంత ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులను సన్మానించారు. మరో ముఖ్య అతిథి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వనాథ రాజు మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.స్వర్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.


జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం


హుకుంపేటలో ఉపాధ్యాయిని సత్కరిస్తున్న బొప్పన అప్పారావు తదితరులు


బొమ్మూరులో టీచర్ పద్మశ్రీకి సన్మానం


వెలుగుబంటి రామచంద్రరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం


ఎస్‌కేవీటీ కళాశాలలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ రామకృష్ణ

వ్యక్తి అదృశ్యం


కరక సత్య ప్రసాద్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తన భర్త ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయారని రాజమహేంద్రవరం ఎస్‌వీజీ మార్కెట్‌కు చెందిన కరక భవాని గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌వీజీ మార్కెట్ యశోద టవర్స్‌లో నివసిస్తున్న 51 ఏళ్ల కరక సత్యప్రసాద్ ఈ నెల ఒకటిన ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. ఈ మేరకు ఆయన భార్య భవాని.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యప్రసాద్ సమాచారం తెలిసిన వారు 94407 96533(సీఐ), 94911 22811 (ఎస్సై) నంబర్లకు తెలియజేయాలని కోరారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ గణేష్

ధవళేశ్వరం: గ్రంథాలయం వీధిలో పట్టపగలు చోరీకి పాల్పడిన జీరి ఆకాష్ రెడ్డి (సాహు)ని ధవళేశ్వరం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.2.15 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ టి.గణేష్ గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 1వ తేదీన గ్రంథాలయం వీధికి చెందిన వంకా సాహిత్య ఇంటికి గడియ పెట్టి పై పోర్షన్‌కు వెళ్లింది. ఆ సమయంలో దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను చోరీ చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టారు. గురువారం ధవళేశ్వరం సున్నంబట్టీ వీధి గంగాలమ్మ రేవు వద్ద ఉన్న ఆకాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతడి ఇంట్లో ప్లాస్టిక్ కవర్‌లో దాచిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా.. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ గణేష్, ఎస్సై పి.హరిబాబు, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, దుర్గాప్రసాదరావు, లక్ష్మణరావులను ఎస్పీ నరసింహ కిశోర్ అభినందించి రివార్డు ప్రకటించారు.

ఇల్లు ఖాళీ చేయాలంటూ వేధింపులు

సీటీఆర్ఐ: తల్లిదండ్రులే సెటిల్‌మెంట్ బ్యాచ్‌తో కలిసి తన కుటుంబంపై దాడి చేయించారని, బలవంతంగా ఇల్లు ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆర్యాపురం మూలగొయ్యి సెంటర్‌లో నివాసం ఉంటున్న జుత్తుక శ్రీనివాస్, ఆయన భార్య దేవి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీను మాట్లాడుతూ తన కష్టార్జితంతో అందరికీ ఇల్లు సరిపోవడం లేదని, రెండో అంతస్తు నిర్మాణం చేశానన్నారు. అయితే కొందరి మాటలు విని తల్లితండ్రులే తనను ఇల్లు ఖాళీ చేయించాలని చూస్తున్నారన్నారు. ఈ విషయంపై హైకోర్టుకు వెళ్లగా ఇల్లు ఖాళీ చేయాలనే హక్కు లేదని స్టే ఆర్డర్ ఇచ్చిందన్నారు. గత నెల 20న తల్లిదండ్రులు పురమాయించిన సెటిల్ మెంట్ బ్యాచ్ తన భార్యను వివస్త్రను చేసి దౌర్జన్యం చేశారని ఆరోపించాడు. దాడిలో దెబ్బలు తిని తాను బాధపడుతుంటే.. మేమే వారిని కొట్టామని తల్లిదండ్రులు జుత్తుక అప్పన్న, సత్యవతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. తమకు తల్లిదండ్రులు, సెటిల్‌మెంట్ బ్యాచ్ నుంచి ప్రాణహాని ఉందని ఆరోపించారు.